సాక్షి
సంగారెడ్డి
గురువారం । 11 । జనవరి । 2024



దిగుబడికి కీలకం..
రబీలో ఆరుతడి పంటలైన వేరుశనగ, మొక్క జొన్న, జొన్న, శనగ పంటలతో పాటు వివిధ రకాల కూరగాయల సాగు ఎంతో మేలు.
వివరాలు 8లో ▸



పల్లె పోరుకు ప్రణాళికలు
నిన్న మొన్నటిదాకా అసెంబ్లీ సాధారణ ఎన్నికలతో సందడిగా ఉన్న పల్లెలు, మళ్లీ పంచాయతీ పోరుతో సందడిగా మారనున్నాయి.
వివరాలు 8లో ▸



దర్జాగా ప్రభుత్వ భూముల కబ్జా
అమీన్‌పూర్ పట్టణంలో ప్రభుత్వ అసైన్డ్ చెరువుల భూములు కబ్జాకు గురవుతున్నాయి. ఈ కబ్జాలకు అధికారుల నుంచి పూర్తి మద్దతు లభిస్తున్నట్లు తెలుస్తోంది.
వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

బెంగళూరు వ్యవసాయ మార్కెట్ల పరిశీలన



బెంగళూరులో మార్కెట్ యార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: రానున్న రోజుల్లో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్‌ను మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో స్టడీటూర్‌లో భాగంగా బుధవారం కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులోని యశ్వంతపూర్, చిక్‌బల్లాపూర్ మార్కెట్ యార్డులను కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, సభ్యులతో కలిసి సందర్శించినట్లు చెప్పారు. ఆయా మార్కెట్ కమిటీల అధికారులతో సమావేశమై క్రయవిక్రయాలు, దుకాణాల కేటాయింపులు, వ్యాపార నిర్వహణ అంశాలపై చర్చించామన్నారు. ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఏటా రూ.6 కోట్ల టర్నోవర్‌కు చేరిందని గుర్తు చేశారు. భవిష్యత్‌లో రాష్ట్రంలోనే మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.

స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోండి



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: స్వయం ఉపాధి పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని ర్యాకల్ క్లస్టర్‌లో జాతీయ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, రాష్ట్ర భవన నిర్మాణ రంగ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పథకాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ క్రర చాందీబాయి చౌహాన్, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, సర్పంచ్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ చెల్లించని వారిపై చర్యలు తీసుకోవాలి



ఈపీఎఫ్ రీజినల్ కమిషనర్ విశాల్ అగర్వాల్‌తో కరచాలనం చేస్తున్న రాధాకృష్ణ

పటాన్‌చెరు టౌన్: కార్మికుల ఈపీఎఫ్ చందాలు చెల్లించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఈపీఎఫ్ రీజినల్ కమిషనర్ విశాల్ అగర్వాల్‌ను ఈపీఎఫ్ ప్రాంతీయ బోర్డ్ మెంబర్ రాధాకృష్ణ కోరారు. బుధవారం పటాన్‌చెరు పట్టణంలోని పీఎఫ్ కార్యాలయంలో ఆయనను కలిసి మాట్లాడారు. ఆధార్ కార్డులో పుట్టిన తేదీల్లో మార్పుల కారణంగా కార్మికులు ఇబ్బందిపడుతున్నారని, వెంటనే వారి సమస్య పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా చాలా పరిశ్రమల్లో వలస కార్మికుల ఈపీఎఫ్ కాంట్రిబ్యూషన్ కాంట్రాక్టర్లు సరిగా చెల్లించడం లేదని కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఆయన వెంట మోహన్ రెడ్డి ఉన్నారు.

ఈజీఎస్ అవకతవకలపై అధికారులదే బాధ్యత

జిల్లా అడిషనల్ పీడీ వామన్‌రావు

కంగ్టి(నారాయణఖేడ్): ఉపాధి హామీ పథకంలో అవకతవకలపై సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని జిల్లా అడిషనల్ పీడీ వామన్‌రావు అన్నారు. మండల కేంద్రం కంగ్టిలో బుధవారం 13వ విడత ప్రజాదర్బార్ నిర్వహించారు. గత వారంలో మండలంలోని అన్ని గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించి గ్రామసభల్లో ఆయా అంశాలపై చర్చించినట్లు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం 2022–23లో ఈజీఎస్‌లో నిర్వహించిన అభివృద్ధి పనులపై ప్రజాదర్బార్‌లో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగీత, ఎంపీడీఓ ముజఫరొద్దీన్, ఎంపీఓ నర్సింలు, బస్వరాజ్, సీఆర్‌పీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

చింతా X నిర్మలారెడ్డి

అధికారిక కార్యక్రమంలో ప్రొటోకాల్ రగడ

- నిర్మలారెడ్డి ఏ హోదాలో పాల్గొన్నారని బీఆర్ఎస్ నిలదీత
- ప్రభుత్వం మాది.. కచ్చితంగా పాల్గొంటా: నిర్మలారెడ్డి
- కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల బాహాబాహీ, ఉద్రిక్తత
- సదాశివపేటలో కల్యాణలక్ష్మి పంపిణీ కార్యక్రమం రసాభాస



సదాశివపేటలో జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి వాగ్వాదం

సదాశివపేట (సంగారెడ్డి): కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రొటోకాల్ వివాదం ఘర్షణకు దారి తీసింది. అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం, తోపులాట జరగడంతో గందరగోళం నెలకొంది. నువ్వెంత అంటే నువ్వెంత అని పరస్పరం ఘర్షణ పడ్డారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వివరాలు.. సదాశివపేటలోని ఐబీ బంగ్లాలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, డీసీసీ అధ్యక్షురాలు తూర్పు నిర్మలారెడ్డి హాజరయ్యారు. మొదట 17వ వార్డు కౌన్సిలర్ షెహజాది బేగం కుమారుడు అబ్దుల్ వాజిద్ మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి పథకం కింద రూ.లక్ష నగదుతో పాటు తులం బంగారం ఎప్పుడిస్తారని డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ విషయమై కాంగ్రెస్ కౌన్సిలర్లు జోక్యం చేసుకొని.. మీ తల్లి కౌన్సిలర్ అయితే.. నువ్వు ఎలా ప్రశ్నిస్తావని నిలదీశారు. అడ్డుతగిలిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు .. డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి ఏ అధికారంతో చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరై వేదికపై కూర్చున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రొటోకాల్ ఎందుకు పాటించలేదని నిలదీశారు. మీకో న్యాయం.. మాకో న్యాయమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ సభ్యత, సంస్కారం మరిచి ప్రవర్తిస్తోందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఇరుపార్టీల నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. అలాగే.. 25వ వార్డులో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ సమయంలో కూడా కాంగ్రెస్ కౌన్సిలర్ భర్త శంకర్‌గౌడ్ లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తుండగా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి చెక్కు పట్టుకునే సమయంలో ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఒకదశలో నువ్వెంత అంటే నువ్వెంత అని దూషించుకున్నారు. పోలీసులు ఇరుపార్టీల నాయకులను సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది.

ఆరు గ్యారంటీల అమలుకు పోరాటం

ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేయలేకపోతే పోరాటం చేస్తామని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ అనంతరం మాట్లాడారు. డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనే ముందు ఏదైనా పదవి తెచ్చుకొని పాల్గొంటే సముచితంగా ఉంటుందన్నారు. ప్రొటోకాల్ పట్టించుకోకుండా గొడవలు సృష్టించడం సరికాదన్నారు. సంగారెడ్డిలో కౌన్సిలర్ హోదాలో పాల్గొనాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. దళిత బంధు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ బంధు చెక్కుల పంపిణీలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. డీడీలు కట్టిన వారందరికీ గొర్రెలు పంపిణీ చేయాలన్నారు. గృహలక్ష్మి పథకం లబ్ధిదారులను అధికారులు గుర్తించారని వారికి త్వరగా ఇవ్వాలన్నారు.

ప్రభుత్వం మాది: నిర్మలారెడ్డి

ప్రభుత్వపథకాల అమలు కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు న్యాయం చేస్తామని డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉందని ప్రజా సంక్షేమ పథకాల అమలుకు తాము ముందుంటామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో కన్నెత్తి కూడా చూడలేదన్నారు.

గొడవలు సృష్టించడం సరికాదు: చింతా

డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనే ముందు ఏదైనా పదవి తెచ్చుకొని పాల్గొంటే సముచితంగా ఉంటుందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. ప్రొటోకాల్ పట్టించుకోకుండా కాంగ్రెస్ నాయకులతో వచ్చి గొడవలు సృష్టించడం సరికాదన్నారు. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనలేదని, తాను కూడా కార్పొరేషన్ చైర్మన్ పదవి వచ్చిన తర్వాతే అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు గుర్తు చేశారు.



సదాశివపేటలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సమక్షంలోనే బాహాబాహీకి దిగిన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు శంకర్‌గౌడ్

25 లోపు సీఎంఆర్ పూర్తి

- రైసు మిల్లర్లకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి టౌన్: ఈనెల 25 లోపు సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి రైస్ మిల్లర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులతో 2022–23 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి సీఎంఆర్ రైస్ డెలివరీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైస్ మిల్లులకు సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యాన్ని త్వరితగతిన మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకు బియ్యం సరఫరా చేసేలా రైస్ మిల్లర్లు సహకరించాలన్నారు. ఈనెల 25లోగా సీఎంఆర్ డెలివరీ అయ్యేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. నిర్ణీత సమయంలో అందజేయనివారిపై 6ఏ కింద కేసు నమోదు చేస్తామని, ఆ మిల్లును బ్లాక్ లిస్టులో పెట్టడంతో పాటు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఖరీఫ్‌కు సంబంధించి జనవరి 25 లోగా అందించాలని స్పష్టం చేశారు. అలాగే రబీకి సంబంధించి ఇప్పటి వరకు 34 శాతం మాత్రమే సీఎంఆర్ పూర్తయ్యిందని మరింత వేగవంతం చేయాలన్నారు. కొందరు రైస్ మిల్లర్లు మిల్లింగ్ అవుతున్నప్పటికీ సీఎంఆర్ ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజువారి నివేదిక పెట్టాలని డీటీసీఎస్‌లకు సూచించారు. ప్రైవేట్ ధాన్యం మిల్లింగ్ చేయొద్దని స్పష్టం చేశారు. 2022–23 ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన కమీషన్‌ను పది రోజుల్లోగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా పౌరసరఫరాల అధికారి వనజాత తదితరులు పాల్గొన్నారు.

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

తప్పులు లేని 2024 ఓటరు జాబితా రూపొందించాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్లతో కలిసి ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో ఓటర్ జాబితా రూపకల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 22 వరకు ప్రతిపాదనలు, అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేయించాలన్నారు. డూప్లికేట్ ఓటర్లపై దృష్టి సారించాలని, వందేళ్ల పైబడిన వారి తాజా జాబితా తెప్పించుకోవాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వివరాలు తెలియజేయాలని సూచించారు. ఓటు నమోదు, ఓటుహక్కు వినియోగంపై స్వీప్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలన్నారు. కుటుంబంలోని వ్యక్తులందరికీ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటుహక్కు ఉండేలా చూడాలన్నారు. ఈనెల 20, 21 తేదీలలో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించడం జరుగుతుందని, బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌ఓ నగేష్, ఐదు నియోజక వర్గాల ఈఆర్‌ఓలు, ఏఈ ఆర్‌ఓలు, ఎన్నికల విభాగపు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నతస్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న జడ్జి హనుమంతరావు

కంది(సంగారెడ్డి): బాలికలు శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికిఎదగాలని జిల్లాన్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి జె.హనుమంతరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని కాశీపూర్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో న్యాయఅవగాహన సదస్సునిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో మంచి ఉద్యోగాలు సాధించడానికి ప్రయత్నించాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సహాయం కోసం సంగారెడ్డిలోని న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత లక్ష్యాన్ని ఛేదించాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్

- అడిషనల్ కలెక్టర్

సంగారెడ్డి అర్బన్: జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా తార ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ యూత్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు.యువత అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. సమస్యలను అధిగమించి లక్ష్యాన్ని ఛేదించాలని సూచించారు. సమస్యలను తల్లిదండ్రులు లేదా అధ్యాపకులకు చెప్పి పరిష్కరించుకోవాలని, తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. అనంతరం సంగారెడ్డి జిల్లా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ లక్ష్యానికి అనుగుణంగా కృషి చేస్తే దేనినైనా సాధించవచ్చన్నారు. బాల్యవివాహాలు, స్త్రీల అక్రమ రవాణా విషయాల్లో జాగ్రత్తగా ఉండాలన్నారు. బాలికలను చదివించినప్పుడే నవ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో ఎల్లయ్య, జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారి సంధ్యారాణి, జిల్లా యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ రామచందర్, తార కాలేజ్ ప్రిన్సిపాల్ రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి జిల్లాస్థాయి బహుమతి

మునిపల్లి(అందోల్): జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో టీచర్ ఎగ్జిబిట్‌లో తాటిపల్లి ఉపాధ్యాయురాలు సుశీలకు జిల్లా స్థాయి బహుమతి లభించింది. బుధవారం సంగారెడ్డిలో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌లో జిల్లా ఎస్పీ రూపేష్, అడిషనల్ కలెక్టర్ చేతుల మీదుగా బహుమతిని అందుకున్నారు. ఉపాధ్యాయురాలిని టీపీటీఎఫ్ నాయకులు లక్ష్మణ్, గోపాల్ అభినందించారు.



బహుమతి అందుకుంటున్న ఉపాధ్యాయురాలు సుశీల

అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ భూములు, చెరువులు, నీటి వనరుల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు చేపట్టినపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ క్రాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్లతో కలిసి రెవెన్యూ, నీటిపారుదల, అటవీ, మత్స్య, వ్యవసాయ, హెచ్‌ఎండీఏ, షుగర్ కేన్ తదితర శాఖల అధికారులతో జెడ్పీ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, నీటి వనరులు ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని, కబ్జాలు, అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఒక్కో ప్రభుత్వ హాస్టల్‌కు ఒక్కో జిల్లా అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించాలన్నారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్లకు సూచించారు. జహీరాబాద్ ట్రైడెంట్ చక్కెర కర్మాగారం రైతులకు చెల్లించాల్సిన బకాయిలు, తీసుకున్న చర్యలపై సంబంధిత అసిస్టెంట్ కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. రైతులకు నష్టం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు.

వీఆర్వో వ్యవస్థను పునరుద్ధరించండి

గజ్వేల్‌రూరల్: వీఆర్వో వ్యవస్థను తిరిగి పునరుద్ధరించాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో భూవివాదాలు, భూహక్కుల పరిష్కారానికి వీఆర్వో వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడిందన్నారు. అవినీతి పేరుతో గత ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దు చేసి భూపరిపాలనను విధ్వంసం చేస్తూ.. పేదలకు భూహక్కులను నిరాకరించిందన్నారు. మాన్యువల్, డిజిటల్ భూరికార్డులను గ్రామాల్లో అందుబాటులో ఉంచాలని, పహాణీలోని అనుభవదారు కాలాన్ని తిరిగి చేర్చాలన్నారు. సమగ్ర భూసర్వే చేయకుండానే ధరణి పేరుతో గత ప్రభుత్వం భూస్వాములకు అనుకూలమైన విధానాలను అమలు చేసిందన్నారు. ధరణిని సంస్కరించి పేదలకు అనుకూలంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

బాల వైజ్ఞానిక ప్రదర్శన.. భళా

- మూడు రోజులపాటు సైన్స్ ఫెయిర్
- మొత్తం 782 ప్రదర్శనలు
- 23 అత్యుత్తమ ప్రదర్శనలు
- రాష్ట్ర స్థాయికి 11 ఎంపిక





విద్యార్థులతో ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి / సంగారెడ్డి అర్బన్: ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు జిల్లా కేంద్రం సంగారెడ్డి సెయింట్ ఆంథోని పాఠశాలలో జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ముగింపు వేడుకలకు ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు కలలను సాకారం చేసుకోవాలన్నారు. ప్రదర్శనలో జిల్లా నుంచి 782 పాఠశాలలు పాల్గొన్నాయి. విద్యార్థులు తమ నమూనాలు ప్రదర్శించి వాటి ఉపయోగాలను సందర్శకులకు వివరించారు. నమూనాలు సందర్శకుల ప్రశంసలందుకున్నాయి. మూడు రోజుల పాటు జరిగిన వైజ్ఞానిక ప్రదర్శన అట్టహాసంగా కొనసాగింది. సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని నింపింది. ప్రదర్శనలో మొత్తం ఏడు విభాగాల్లో 23 అత్యుత్తమ ప్రదర్శనలు, అందులో 11 రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ పేర్కొంది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి విజయ్, ఉపాధ్యాయులు జాకీర్ హుస్సేన్, ఎంఈఓలు, ఆంథోని పాఠశాల చైర్మన్ సాల్మన్ రెడ్డి, ప్రిన్సిపాల్ కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నేషనల్ సైంటిఫిక్ టూల్ ప్రదర్శనకు ఎంపిక



నిమ్మకాయలు తెంపే పరికరం చూపుతున్న విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం ఇంద్రేశం ప్రభుత్వ పాఠశాల 7వ తరగతి విద్యార్థులు ఉజ్జీవన్, విజయ్‌సింగ్ ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన సైంటిఫిక్ టూల్ ప్రజంటేషన్‌లో రెండో స్థానంలో నిలిచి, జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో నిమ్మకాయలు సులభంగా తెంపే పరికరం తయారుచేసి ప్రదర్శించి, ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. ఇందుకు రూ.2500 నగదు బహుమతి వచ్చిందని తెలిపారు.

క్లుప్తంగా

జాతీయ యువజన ఉత్సవాలకు ఎంపిక



దేవిడ్‌ను అభినందిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

సిద్దిపేట ఎడ్యుకేషన్‌: మహారాష్ట్రలోని నాసిక్ పట్టణంలో 12 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ యువజన ఉత్సవాలకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్‌) విద్యార్థి డేవిడ్ ఎంపికైట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రసాద్ తెలిపారు. బుధవారం డేవిడ్‌ను కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ప్రసాద్ మాట్లాడుతూ... జాతీయ యువజన ఉత్సవాలకు కళాశాల విద్యార్థి ఎంపికవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఉత్సవాల్లో ప్రధాని మోదీ పాల్గొననున్నట్లు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల నుంచి నలుగురు విద్యార్థులు ఎంపిక కాగా, అందులో మా కళాశాల విద్యార్థి ఉండడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ మధుసూదన్, డాక్టర్ పీ.పల్లవి, డాక్టర్ మహేందర్, డాక్టర్ శ్రద్ధానందం, డాక్టర్ రాణి, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వేణు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుల్లని వేణు అన్నారు. ఈ నెల 12న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న పార్లమెంట్ మార్చ్ పోస్టర్‌ను బుధవారం పట్టణ కేంద్రంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని, కేంద్రం ప్రవేశ పెట్టిన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ చలో పార్లమెంట్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. బీజేపీ ప్రభుత్వం విద్యను కాషాయీకరణ, కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ చేసేలా కుట్రలు చేస్తుందన్నారు. నూతన విద్యా విధానం పేద మధ్యతరగతి విద్యార్థులు విద్యకు దూరం అయ్యే అవకాశాలున్నాయన్నారు. పార్లమెంట్ మార్చ్‌కి యువజన, విద్యార్థి సంఘాలు, విద్యార్థులు, మేధావులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సాయికిరణ్‌రెడ్డి, అఖిల్, రాజేందర్, అభిమన్యు, రాకేశ్, కల్యాణ్, లోకేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలి

- ఎస్‌జీటీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్‌): ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం కోరారు. బుధవారం చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లిలో ఎస్‌జీటీ క్యాలెండర్ ఆవిష్కరించడంతో పాటు సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడి పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 317 ద్వారా అన్యాయం జరిగిన ఉపాధ్యాయులకు వెంటనే న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌టీజీ ఉపాధ్యాయ సంఘం నాయకులు అశోక్, రమేశ్, నర్సింహులు, శ్రీనివాస్, ప్రవీణ్, శివక్రిష్ణ, నరేశ్ పాల్గొన్నారు.

పల్లె పోరుకు ప్రణాళికలు

- పోటీకి సిద్ధమవున్న ఆశావహులు
- ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో నిమగ్నం
- ఆర్థిక వనరులు సైతం ఏర్పాటు
- రిజర్వేషన్లపై నెలకొన్న ఉత్కంఠ!



నిన్న మొన్నటిదాకా అసెంబ్లీ సాధారణ ఎన్నికలతో సందడిగా ఉన్న పల్లెలు, మళ్లీ పంచాయతీ పోరుతో సందడిగా మారునున్నాయి. జనవరితో 31తో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిస్తుంది. దీంతో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈసారి గ్రామ సర్పంచ్ పదవికి పోటీ చేసేందుకు ఆయా గ్రామాల్లో ఆశావహులు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నారు.

దౌల్తాబాద్(దుబ్బాక):

మండలంలోని గ్రామాల్లో ఇప్పటికే రాజకీయ నాయకులు ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ఎత్తుకు పైఎత్తులు వేసేందుకు సంసిద్ధం అవుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మద్దతుతో పోటీ చేసేవాళ్ల సంఖ్య ఒక్కో గ్రామం నుంచి 5 నుంచి 10 మందికిపైగా ఉన్నట్లు సమాచారం. ఇందుకు ప్రధాన పార్టీల మద్దతుతో పోటీలో నిలబడేందుకు ఇప్పటికే అవసరమైన ఆర్థిక వనరులను సమాకూర్చుకుంటున్నారు.

రిజర్వేషన్ల కోసం ఎదురుచూపు

గ్రామ సర్పంచ్‌కు పోటీ చేయాలనుకునే వారికి ఇప్పుడు రిజర్వేషన్ల టెన్షన్ పట్టుకుంది. తమ గ్రామానికి ఏ రిజర్వేషన్ వస్తుంది. పంచాయతీరాజ్ 2018 రిజర్వేషన్ల చట్టం ప్రకారం ఎన్నికలు జరుగుతాయా.. లేదా ఏమైనా మార్పులు ఉంటాయా అనే కోణంలో ఆలోచిస్తున్నారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థల రిజర్వేషన్లను వరుసగా 10 ఏళ్లు కొనసాగిస్తామని, పోటీ తత్వంతో గ్రామాలను అభివృద్ధి చేసుకొని మళ్లీ తమ అదృష్టాలను ఎన్నికల రూపంలో పరీక్షించుకోవాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. అంతేకాకుండా పంచాయతీరాజ్ 2018 చట్టంలో ఇదే అంశాన్ని పొందుపరిచారు. దీంతో ప్రస్తుతం మండలంలోని 24 గ్రామాలకు ఏ రిజర్వేషన్లు వర్తిస్తాయో తిరిగి అవే రిజర్వేషన్ కొనసాగుతాయని అంతా భావించారు.

కొనసాగిస్తారా?

సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో రిజర్వేషన్లను కొనసాగిస్తారా లేదా దానిపై గ్రామాల్లో జోరుగా చర్చ జరుగుతుంది. ప్రస్తుతానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. గడువు ముగిసేలోగా ఎన్నికలు నిర్వహిస్తారా ప్రత్యేక అధికారులతో పాలనను కొనసాగించే అవకాశాలు ఉన్నాయా.. అనే అనుమానాలు కూడా కలుగుతున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన డేటాను మాత్రం సేకరించి టీ–పోల్‌లో నిక్షిప్తం చేసే పనిలో ఉంది.

ఆర్థిక వనరుల కోసం..

గ్రామాల్లో అన్నీ అనుకున్నట్లుగానే రిజర్వేషన్ కలిసి వస్తే పోటీలో నిలబడేందుకు అవసరమైన ఆర్థిక వనరులను ఆశావహులు సమకూర్చుకుంటున్నారు. ఒక్కో ఓటరుకు ఎంత ఇవ్వడమనేది ప్రధానం కాకుండా గెలుపే లక్ష్యంగా ముందుకు సాగేందుకు అవసరమైన వ్యూహ ప్రతివ్యూహాలను రచిస్తున్నారు. సర్పంచ్‌గా పోటీ చేసే ఒక్కో అభ్యర్థి సుమారు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఖర్చు పెట్టేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.



గ్రామ పంచాయతీ భవనం

చెరకు బకాయిలను చెల్లించాలి

బీజేపీ రాష్ట్ర నాయకుడు జైపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

జహీరాబాద్‌: చెరకు రైతులకు ట్రైడెంట్ యాజమాన్యం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డీసీసీబీ మాజీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎం.జైపాల్‌రెడ్డి కోరారు. బుధవారం జహీరాబాద్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు యాజమాన్యం రూ.9 కోట్ల మేర చెరకు బిల్లులు బకాయి పడిందన్నారు. బకాయిలు చెల్లించకపోగా, ఈ సీజన్ చెరకు క్రషింగ్‌ను సైతం చేపట్టకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చెరకు బకాయిలను ఇప్పించాలని కోరారు. సమావేశంలో మల్‌చల్మ పీఏసీఎస్ చైర్మన్ ఎం.బుచ్చిరెడ్డి, బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ఎన్.జగన్నాథ్, అడివన్న, సుధీర్ భండారి, వైద్యనాథ్, ఏక్‌నాథ్ పాటిల్, శ్రీనివాస్ గుప్తా, జ్యోతి, సతీష్‌రెడ్డి, శివాజీపాటిల్, మోహన్ రెడ్డి, శంకర్‌రెడ్డి, కిష్టన్న, విజేందర్‌రెడ్డి, వేణు, కార్తీక్ రెడ్డి, నర్సింగ్, రాము, మోహన్ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు..

సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామని, జహీరాబాద్ పట్టణంలోని ఆయా కాలనీల్లో మహిళలు ఇళ్ల ఎదుట ముగ్గులను తీర్చిదిద్దాలని సూచించారు. ఉత్తమ ముగ్గులను ఎంపిక చేసి బహుమతులను అందజేస్తామన్నారు.

హత్య చేసి.. ప్లాస్టిక్ కవర్‌లో కట్టి పడేసి..

- అస్థిపంజరం గుర్తించిన పోలీసులు
- దారుణానికి ఒడిగట్టిన బంధువులు
- 5 నెలల తర్వాత వెలుగులోకి..



ఘటనా స్థలంలో ఎస్పీ రూపేశ్



గోస్వామి(ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): కుటుంబ కలహాలతో బంధువులే వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. నేరం ఎక్కడ బయటపడుతుందో అని మృతదేహాన్ని ప్లాస్టిక్ కవర్‌లో కట్టి ఓ రహదారి కల్వర్టు కింద పడేశారు. ఐదు నెలల నుంచి కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసులు బుధవారం మృతుడి అస్థి పంజరాన్ని గుర్తించారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జిన్నారంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బొల్లారం సీఐ నయీముద్దీన్ కథనం ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బ్రిజేష్ గోస్వామి(26) జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలో గల పోచమ్మ బస్తీలో నివాసం ఉంటూ ఓ పరిశ్రమలో పనులు చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాడు. గతేడాది ఆగస్టు 6న గోస్వామి కనబడటం లేదని అతని భార్య ఆర్తిదేవీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్‌కేసుగా నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే.. గోస్వామి హత్యకు గురయ్యాడని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. గోస్వామి బంధువులను తమదైన శైలిలో విచారించారు. దీంతో గోస్వామిని తామే హత్య చేసినట్లు బంధువులు అజయ్, సీతు, రాజన్, విజయ్ అంగీకరించారు. మృతదేహాన్ని ఖాజీపల్లి ప్రధాన రహదారి కల్వర్టు కింద ఓ ప్లాస్టిక్ సంచిలో పడేసినట్లు నిందితులు వెల్లడించారు. ఎస్పీ రూపేశ్, డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, సీఐ నయీముద్దీన్‌తోపాటు పోలీసులు బుధవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గోస్వామి మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి, అస్థిపంజరం మాత్రమే కనిపించింది. మృతదేహంపై ఉన్న బట్టల ఆధారంగా కుటుంబ సభ్యులు గోస్వామి మృతదేహంగా గుర్తించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కొన్ని కారణాల వల్ల గోస్వామి తన చెల్లిని కాపురం చేసేందుకు పంపకపోవడంతో కక్ష కట్టి అత్తారింటికి చెందిన బంధువులే హత్య చేసినట్లు సీఐ వివరించారు.

కారు బీభత్సం

- రెండు స్కూటీలు, ట్రాలీ ఆటోను ఢీ
- మహిళకు తీవ్ర గాయాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు):ఇన్నోవా కారు బీభత్సం సృష్టించి ట్రాలీ ఆటోను, రెండు స్కూటీలను ఢీ కొట్టింది. ఈ ఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఎల్‌ఐజీ కాలనీకి చెందిన గృహిణి సుమ బిందు స్కూటీపై బుధవారం మధ్యాహ్నం అశోక్‌నగర్ నుంచి పటాన్‌చెరు వెళ్తుంది. బీరంగూడ యూటర్న్ వద్ద నవీన్ కుమార్ కారు అతివేగంగా నడుపుకుంటూ వచ్చి సుమ బిందు స్కూటీని, మరో స్కూటీని, ట్రాలీ ఆటోను ఢీట్టాడు. ఈ ప్రమాదంలో సుమ బిందుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆమె భర్త శ్యామ్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అదుపులోకి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ దగ్ధం

శివ్వంపేట(నర్సాపూర్‌): గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ని దగ్ధం చేసిన ఘటన మండల పరిధి పెద్దగొట్టిముక్ల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దాసరి నర్సింలు తన బైక్‌ని ఇంటి ఎదుట మంగళవారం రాత్రి పార్క్ చేశాడు. అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో ఇంటి బయట పొగరావడంతో గమనించి బయటకు వెళ్లిచూశాడు. బైక్ దగ్ధమవుతుండగా మంటలను ఆర్పేందుకు కుటుంబ సభ్యులు ప్రయత్నించినప్పటికీ పూర్తిగా దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే తన బైక్‌ని తగులబెట్టారని బాధితుడు దాసరి నర్సింలు వాపోయాడు. పోలీస్‌లకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ రవికాంత్ రావు క్లూస్‌టీంతో ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు.



ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

పారిశుద్ధ్య పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొండపోచమ్మ జాతర సమీపిస్తున్న తరుణంలో అక్కడి వసతులపై బుధవారం సాక్షిలో 'కొండపోచమ్మ తల్లీ.. వసతులేవీ' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై స్పందించిన ఎంపీడీఓ శ్రీనివాస్ వర్మ, ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి పారిశుద్ధ్య కార్మికులతో కొండపోచమ్మ ఆలయ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు ప్రారంభించారు. ఆలయ సమీపంలోని మురికి కాల్వలు శుభ్రం చేశారు. చెత్తా చెదారం తొలగించారు. అలాగే ఆలయ సిబ్బంది చికెన్, మటన్ షాపుల నిర్వాహకులకు వ్యర్థ పదార్థాలు మురికి కాల్వల్లో వేయొద్దని అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య నిర్మూలన పనులు పూర్తి చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఈఓ తెలిపారు.



పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

'సాగర్ నీటిని విడుదల చేయాలి'



శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

తొగుట(దుబ్బాక): కొమురవెల్లి మల్లన్న సాగర్ నీటిని యాసంగి పంటకు విడుదల చేయాలని కోరుతూ కాంగ్రెస్ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి మండలంలోని ఎల్లారెడ్డిపేట రైతులు వినతి పత్రం అందజేశారు. బుధవారం దుబ్బాక క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసి గ్రామ చెరువు, బొల్లక్క చెరువులోకి నీటిని విడుదల చేయాలంటూ కోరారు. చెరువు నింపితే యాసంగిలో వందల ఎకరాల్లో వరి పంట సాగవుతుందన్నారు. అంతేగాకుండా భూగర్భ జలాలు మట్టం పెరిగి బోరుబావుల కింద వరిపంట సాగుచేస్తానన్నారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించాలని వారు కోరారు. స్పందించిన శ్రీనివాస్‌రెడ్డి ఫోన్‌ద్వారా జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి మూడు రోజుల్లోగా నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో అల్వాల సర్పంచ్ కిష్టయ్య, టీపీసీసీ ఫిషర్మెన్ కార్యదర్శి తిరుపతి, పార్టీ మండల అధ్యక్షుడు స్వామి, నాయకులు నరేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డిపేట రైతులు నర్సింలు గౌడ్, రవీందర్, ఎల్లయ్య, మల్లయ్య, రామయ్య, మహేశ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు ధ్వంసం



మొక్కలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

కోహెడరూరల్(హుస్నాబాద్): ఓ ఇంటి ఆవరణంలో పెంచుతున్న గంజాయి మొక్కలను బుధవారం ఎక్సైజ్ అధికారులు ధ్వంసం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఆరెపల్లి గ్రామ పరిధిలోని చంద్రనాయక్ తండాలో భానోత్‌కోమలి అనే మహిళ ఇంటి ఆవరణంలో 26 గంజాయి మొక్కలను పెంచుతుంది. పక్కా సమాచారం మేరకు జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సీఐ శ్రీధర్, హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐ పవన్‌తోపాటు సిబ్బంది కోమలి ఇంటిలో సోదాలు నిర్వహించారు. అక్కడ ఉన్న 26 గంజాయి మొక్కలతోపాటు ఇంట్లోని 240 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కోమలితోపాటు మనుమడు బానోత్ గణేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

పొలం పనులకు వెళ్లి..

రైతు కూలీ మృతి

వట్‌పల్లి(అందోల్): పొలం పనులకు వెళ్లిన ఓ రైతు కూలీ మృతి చెందిన ఘటన అందోలు మండల పరిధిలోని అక్సాన్‌పల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంగళి ప్రభాకర్ (35) రోజూ మాదిరిగానే గ్రామంలోని ఓ రైతు వద్దకు వ్యవసాయ కూలీ పనులకు వెళ్లాడు. పొలం గట్టు చెక్కుతుండగా అకస్మాత్తుగా మూర్ఛ వచ్చింది .దీంతో పొలంలో ఉన్న నీటిలో ముందుకు పడిపోయి ఊపిరాడక అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడు కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిసింది. మృతుడికి భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం రైతుకూలీ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హరినారాయణ వర్మతోపాటు పలువురు నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



ప్రభాకర్ మృతదేహం

క్రెడిట్ కార్డు అప్‌గ్రేడ్ అంటూ మోసం

రూ.98,746 పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్‌: క్రెడిట్ కార్డ్ అప్‌గ్రేడ్ అంటూ వచ్చిన ఫోన్ కాల్‌కి స్పందించి ఓ వ్యక్తి డబ్బులు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడ భ్రమరామ మల్లికార్జున ఫేజ్–2కు చెందిన వ్యక్తికి జనవరి 4వ తేదీన క్రెడిట్ కార్డ్ అప్‌గ్రేడ్ చేయాలంటూ ఫోన్ కాల్ వచ్చింది. అపరిచిత వ్యక్తి పంపిన లింక్ ఓపెన్ చేసి తన వివరాలను నమోదు చేశాడు. వెంటనే బాధితుడి ఖాతా నుంచి రూ.98,746 కట్ అయ్యాయి. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దిగుబడికి కీలకం.. నీటి యాజమాన్యం

- యాజమాన్య పద్ధతులు పాటించాలి
- సకాలంలో పంటకు నీరందిస్తే అధిక దిగుబడి
- జిల్లా వ్యవసాయాధికారి నర్సింగ్‌రావు
- రైతులకు సూచనలు, సలహాలు..



ఖమ్మంపల్లిలో ఆకు కూరలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)



హైద్లాపూర్‌లో చెరకు పంట సాగు చేస్తున్న రైతు

మునిపల్లి(అందోల్): రబీలో ఆరుతడి పంటలైన వేరుశనగ, మొక్కజొన్న, జొన్న, శనగ పంటలతోపాటు వివిధ రకాల కూరగాయల సాగుతో ఎంతో మేలు. నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి నర్సింగ్‌రావు సూచిస్తున్నారు. పంటలకు నీరు నేలలోని తేమశాతాన్ని బట్టి అందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నీరు ఎక్కువైనా తక్కువైనా పంట దిగుబడిపై పూర్తిగా ప్రభావం చూపి దిగుబడి తగ్గే అవకాశం ఉంది. కాబట్టి ఏ పంటకు ఏ సమయంలో నీరు ఎంత అందించాలి అనే దానిపై అవగాహన ఉండాలని చెబుతున్నారు.

నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే నీటిని ఆదా చేసుకోవడంతోపాటు పంటలో మంచి దిగుబడులు సాధించవచ్చు. ముఖ్యంగా రైతులు తమ పంట పొలాల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుంటే వర్షపు నీరు, ఇతర నీరు అందులోకి వెవెళ్లి నిల్వ ఉంటుంది. దీంతో సమీపంలో భూ గర్భ జలాలు పెరిగి ఆ నీటిని సాగుకు వినియోగించుకోవచ్చు.

నీటి తడులు ముఖ్యం

రైతులు పలు రకాల పంటలకు కొమ్మలు వచ్చే దశలో నీటి తడులు అందించాలి. పూత దశలో పంట నీటి ఎద్దడికి గురైతే 50 శాతం కన్నా ఎక్కువ దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉంది. పంటలకు గింజ, కాయ కట్టే దశలో నీటిని అందించాలి. జొన్న పంటలకు సాధారణంగా 400 నుంచి 660 మిల్లీ మీటర్ల నీరు అవసరం ఉంటుంది. మొక్క జొన్నకు 400 నుంచి 550 మిల్లీ మీటర్ల నీరు, వేరు శనగతో పాటు ఇతర చిరు ధాన్యాలకు 300–400 మి. మీ నీరు అవసరం ఉంటుంది. ఇందులో మొదటి తడి మొక్కలు నాటిన తర్వాత 15–18 నుంచి రోజులలోపు నీటి తడులు ఇవ్వాలి. చివరి తడి పంట తీసే సమయంలో కంటే 15 నుంచి 28 రోజులలోపు నీరందించాలి. రైతులు ఎప్పటికప్పుడూ వ్యవసాయాధికారుల సూచనలు సలహాలు పాటించి సస్య రక్షణ చేపట్టాలి. పంటల సాగులో నీటి వినియోగాన్ని బట్టి పొదుపుగా వాడితే అధిక దిగుబడులు సాధించడమే కాకుండా విలువైన నీటిని కాపాడుకోవచ్చు.

కూరగాయల సాగుతో లాభం



కూరగాయలు సాగు చేసేటప్పుడు ఎప్పటికప్పుడూ నీరందించి పురుగు నివారణ మందు పిచికారీ చేయాలి. పంట చేతికందే సమయంలో మార్కెట్‌లో డిమాండ్ ఉంటే లాభాలు ఉంటాయి. దిగుబడి పెరిగిన సమయంలో మార్కెట్‌లో డిమాండ్ లేకపోతే తీవ్ర నష్టం వచ్చే అవకాశం ఉంది. కూరగాయల సాగుకు ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు మంజూరు చేయాలి.

– బోయిని శ్రీనివాస్, రైతు

40 వేల హెక్టార్లలో..



జిల్లాలో సుమారు 40 వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. చెరకు, వరి, వివిధ రకాల కూరగాయలు, సాగవుతున్నాయి. ముఖ్యంగా 11 వేల హెక్టార్లలో ఆరుతడి పంటలు. 9 వేల హెక్టార్లలో వరి, 7,026 హెక్టార్లలో శనగ పంటలతోపాటు వివిధ రకాల కూరగాయలు, బెండకాయ, వంకాయ, మీరపకాయ, చిక్కుడు కాయతోపాటు తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు.

– నర్సింగ్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి